సాక్షి సిద్దిపేట

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



ఆశలు సజీవం

ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వృథా నీటి మళ్లింపు అంశం తెరపైకి వచ్చింది.

వివరాలు 8లో ▸



పల్స్ పోలియోకు సమాయత్తం

పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశించారు.

వివరాలు 8లో ▸



పర్యావరణానికి ముప్పు

ప్లాస్టిక్ వాడకంపై సరైన అవగాహన లేకపోవడంతో పర్యావరణంతోపాటు ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తరణి



మాట్లాడుతున్న జడ్జి తరణి

దుబ్బాకటౌన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని..ఎట్టి పరిస్థితుల్లో బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని దుబ్బాక ప్రథమ శ్రేణి న్యాయమూర్తి తరణి అన్నారు. శనివారం దుబ్బాకలోని నీలకంఠ భవన్‌లో ప్రజలకు, విద్యార్థులకు చట్టం, న్యాయ సలహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలన్నారు. అనవసరంగా గొడవలు పడొద్దని ఏదైనా సమస్య ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. బాల్య వివాహాలు జరగకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐ గంగరాజు, కోర్టు సూపరింటెండెంట్ సుధాకర్, రాంజీ, రాణి తదితరులు ఉన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ రఘురాం

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్ అదాలత్ వచ్చే నెల 9న నిర్వహిస్తున్నట్లు, అందరి సమన్వయంతో విజయవంతం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం అన్నారు. సిద్దిపేట కోర్టు భవనంలో పోలీసు శాఖ అధికారులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో అధిక మొత్తంలో కేసులు రాజీపడేలా చూడాలని పోలీసుశాఖ అధికారులకు, న్యాయవాదులకు సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు స్వాతిరెడ్డి, మిలింద్‌కాంబ్లే, చందన, శ్రావణి, పోలీసు అధికారులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

విద్యుత్‌శాఖ డీఈ మహేశ్‌కుమార్



మాట్లాడుతున్న మహేశ్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్‌శాఖ ఎస్‌ఈ మహేశ్‌కుమార్ తెలిపారు. శనివారం జిల్లా విద్యుత్‌భవన్‌లో అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ సాగుకు సరిపడా విద్యుత్‌తో పాటుగా గృహ అవసరాలకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో విద్యుత్ డిమాండ్ కు సరిపడా సరఫరా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శిశు మరణాలను నివారిద్దాం

సిద్దిపేటరూరల్: శిశు మరణాల నివారణ చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. ఆస్పత్రిలో కూడా సరైన సమయంలో, సరైన చికిత్స అందించడం ద్వారా శిశు మరణాలను నివారించవచ్చని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్ ఓ డాక్టర్ కాశీనాథ్, డీఐఓ డాక్టర్ విజయరాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రజిని, డిప్యూటీ డీఎంహెచ్ వోలు డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ ప్రభాకర్, డీడబ్ల్యూఓ సావిత్రి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వేణు, డాక్టర్ సాయిరాం, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆరో ఆదివారం

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న బ్రహ్మోత్సవాల్లో నేడు ఆరో ఆదివారం. భక్తులు భారీగా తరలి రానున్నారు. స్వామి వారి దర్శనానికి తరలివచ్చే భక్తులకు ఆలయ పాలక మండలి, ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పొదుపులో మేటి.. వీరే సాటి

ఆదర్శంగా పురుషుల పొదుపు సంఘం... నంగునూరు మండలంలో 25 ఏళ్లుగా సేవలు



డబ్బులు జమ చేస్తున్న మగ్దుంపూర్ వాసులు

సండే స్పెషల్

వీరంతా పురుషులు.. బాధ్యత కలిగిన వ్యక్తులుగా బంగారు భవిష్యత్తు నిర్మించుకోవాలనుకున్నారు. నలుగురిలో తలెత్తుకు తిరగాలని కలగన్నారు. వీరి ఆలోచనకు తగ్గట్టుగానే పురుషుల పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా 25 ఏళ్లుగా మహిళల పొదుపు సంఘాలకు దీటుగా నిర్వహిస్తున్నారు. సంపాదనలో కొంత డబ్బును ప్రతినెలా పొదుపు చేస్తూ ఆపదకాలంలో కుటుంబాలకు అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారు. వడ్డీ వ్యాపారుల జోలికి వెళ్లకుండా వారంతా ఐక్యంగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నంగునూరు మండల పొదుపు సంఘం రూ.9 కోట్ల టర్నోవర్‌తో లావాదేవీలు నిర్వహిస్తుండటం విశేషం. ఈనెల 29న సిల్వర్ జూబ్లీ నిర్వహిస్తున్న సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

– నంగునూరు (సిద్దిపేట)

- సభ్యుల ఆర్థిక సమస్యలకు చెక్
- రూ.9 కోట్ల టర్నోవర్‌తో సంఘం లావాదేవీలు
- ఆన్‌లైన్ సేవలతో హైటెక్ నిర్వహణ
- ఈనెల 29న సిల్వర్ జూబ్లీ సమావేశం

పొదుపు అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది మహిళలే.. వారికి దీటుగా పురుషులు కూడా పొదుపు సంఘాలు ఏర్పాటు చేశారు. 25 ఏళ్ల కిందట సంఘాలను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండల పొదుపు సమితియే కాకుండా గ్రామాల్లోనూ సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. సంపాదనలో కొంత డబ్బును ప్రతినెలా పొదుపు చేస్తే ఆపదకాలంలో అండగా నిలుస్తుందనే భరోసా కల్పిస్తున్నారు. గ్రామ సంఘాలకు తోడుగా మండల సంఘం సభ్యులకు ఆర్థిక సహాయం అందిస్తూ వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా చూస్తున్నారు. సభ్యుడు మరణిస్తే కుంటుంబానికి ప్రమాద బీమా అందిస్తున్నారు. కోట్ల రూపాయలు టర్నోవర్ సాధించిన నంగునూరు మండల పురుషుల పొదుపు సంఘాన్ని ఆర్‌బీఐ, నాబార్డు ప్రతినిధులు ప్రశంసలతో ముంచెత్తడం వీరి పని తీరుకు నిదర్శనం. వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలో వేల సంఖ్యలో సంఘాలను ఏర్పాటు చేసుకొని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

సభ్యుడికి బీమా..

సంఘంలో సభ్యుడిగా చేరిన వారికి బీమా వర్తింపజేస్తున్నారు. ఒక సభ్యుని నుంచి రూ. 500 నుంచి వెయ్యి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సామూహిక నిధి కింద ఒక్కో సభ్యుడి వద్ద సంవత్సరానికి రూ.130 చొప్పున వసూలు చేస్తారు. సభ్యుడు మరణిస్తే అతని నామినీకి అభయనిధి కింద రూ.60 వేలతో పాటు మరో రూ.10 వేల ఆర్థిక సహాయం చేస్తారు. అలాగే గ్రామ సంఘం నుంచి అంత్యక్రియల నిమిత్తం రూ.రెండు వేల నుంచి నాలుగు వేలు అందజేస్తారు. సభ్యుని పేరిట జమ చేసిన మొత్తాన్ని అతని కుటుంబానికి చెల్లించి ఆర్థిక బరోసా కల్పిస్తున్నారు.



రాంపూర్‌లో సభ్యుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న సమితి నిర్వాహకులు

ఆన్‌లైన్‌తో..

రాజగోపాల్‌పేట కేంద్రంగా సొంత భవనం నిర్మించి మండల సమాఖ్యలో 15 మంది సిబ్బందిని నియమించారు. గ్రామ, మండల సమాఖ్య లావాదేవీలను డిజిటలైజేషన్ చేసి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా హైటెక్ పద్ధతిలో నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే లాకర్ సదుపాయం కల్పించడం ద్వారా బ్యాంక్‌లతో పని లేకుండా సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో నెలవారిగా జరిగే సమావేశాల్లో మండల సమాఖ్య సభ్యులు పాల్గొని సంవత్సరానికి ఒకసారి మహాసభ, సాధారణ సభ నిర్వహిస్తూ పని చేస్తున్నారు. నంగునూరు మండల సమాఖ్య 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈనెల 29న సిల్వర్‌జూబ్లీ సమావేశానికి ఏర్పాట్లు చేశారు.

నూతన సంఘం స్థాపించాలంటే..

గ్రామంలో నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటే మండల సమితి అధ్యక్షుడిని సంప్రదించాలి. సంఘంలో సభ్యులుగా చేరాలంటే 18 ఏళ్ల నిండి 65 లోపు వయస్సు ఉన్నవారు అర్హులు. ఒక్కో గ్రూపులో అయిదుగురు చొప్పున ఎన్ని గ్రూపులైనా ఏర్పాటు చేసుకొనే అవకాశం ఉంది. సంఘంలో చేరే సభ్యుడు ప్రతినెలా కనీసం రూ.వంద పొదుపు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.

సభ్యులకు అండగా..

ప్రతి సంవత్సరం సభ్యుడు జమ చేసిన పొదుపు డబ్బులకు వచ్చే లాభాలను అతని వ్యక్తిగత ఖాతాలో బోనస్ రూపకంగా జమ చేస్తారు. ఇదే కాకుండా పొదుపు ఖాతా, అభయనిధి, ప్రత్యేక అప్పులు, వ్యవసాయానికి, అత్యవసర అవసరాల నిమిత్తం వ్యక్తిగత ఖాతాలో జమ చేసిన డబ్బులకు మూడు రేట్ల డబ్బులను అప్పుగా ఇస్తారు. ఈలెక్కన రూ.10 వేల నుంచి రూ.లక్షా 50 వేల వరకు అప్పు తీసుకునే అవకాశం ఉంది. 65 ఏళ్లు నిండిన వ్యక్తి సభ్యత్వం రద్దు చేసి అతనికి రావాల్సిన పూర్తి డబ్బులు చెల్లిస్తారు. లేదా అతని పొదుపు, బోనస్ డబ్బులు కలిపి మార్గదర్శకుల పొదుపు ఖాతాలో జమచేస్తే నెలకు 12 శాతం వడ్డీ చెల్లిస్తారు.

4,250 మంది సభ్యులుగా..

కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో బృందం సభ్యులు పర్యటించి సంఘం పని తీరుపై అవగాహన కల్పించారు. దీంతో నంగునూరు మండలంలో 1999 లోని రాజగోపాల్‌పేట కేంద్రంగా సాయి పురుషుల పొదుపు సమితి ప్రారంభమైంది. ముందుగా ఆరు గ్రామాల్లో ప్రారంభమైన పొదుపు సంఘాలు ప్రస్తుతం 14 గ్రామాల్లో విజయవంతంగా నడుస్తున్నాయి. 850 గ్రూపులకు గాను మొత్తం 4,250 మంది సభ్యులుగా చేరి ప్రతినెలా డబ్బులను పొదుపు చేస్తున్నారు. నంగునూరు మండలంలో మహిళా సంఘాలు 13 ఉన్నాయి.



వృద్ధాప్యంలో అండగా..

డబ్బులు పొదుపు చేస్తే వృద్ధాప్యంలో అండగా నిలుస్తుందనే భరోసాతో 1992లో వరంగల్‌లో సహకార వికాస సంస్థను రామిరెడ్డి ప్రారంభించారు. గ్రామాల్లో అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్న వారి పరిస్థితి తెలుసుకొని పురుషుల పొదుపు సంఘాలను ఏర్పాటు చేసి ఆదుకోవాలని రామిరెడ్డి సంకల్పించారు. ఈ నేపథ్యంలో అన్ని గ్రామాల్లో తిరిగి అవగాహన కల్పించారు.

ఎంతో కష్టపడ్డాం..



పురుషుల పొదుపు సంఘం పెడదామని చెప్పగానే గ్రామాల్లో అందరు పెదవి విరిచారు. చాలా కష్టపడి ఆరు గ్రామాల్లో సమితిలను ప్రారంభించాం. ప్రస్తుతం 14 గ్రామాల్లో సభ్యులకు అప్పులిస్తూ విజయవంతంగా నడవడం సంతోషంగా ఉంది.

– చారగొండ రాజిరెడ్డి, ముంద్రాయి. (సమితి మొట్టమొదటి మండలాధ్యక్షుడు)

ఆర్థిక సహాయం సైతం..



నంగునూరు మండలంలో మహిళా పొదుపు సంఘాలకు దీటుగా పురుషుల పొదుపు సంఘాలు నడుస్తున్నాయి. నంగునూరు మండల సమితి సుమారుగా రూ 9 కోట్ల లావాదేవీలతో నడుస్తోంది. సభ్యులకు అప్పులివ్వడమే కాకుండా బీమా ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నాం. కొత్తగా సంఘాలు ఏర్పాటు చేయాలనుకుంటే రాజగోపాల్‌పేట లోని సాయి పురుషుల సమితి కార్యాలయంలో సంప్రదించవచ్చు.

– కదారి తిరుపతిరెడ్డి, మగ్దుంపూర్ (సమితి ప్రస్తుత మండల అధ్యక్షుడు)

లెక్క పక్కాగా..



పొదుపు సంఘాలను ఏర్పాటు చేసిన నాటి నుంచి సమితికి సంబంధించిన లావాదేవీలు చూస్తున్నాను. లెక్క పక్కాగా ఉండడం, ఆపదలో సభ్యులను ఆదుకోవడంతో మాపై ప్రజలకు నమ్మకం ఏర్పడింది. మారుతున్న కాలానికి అనుగుణంగా లాకర్ సదుపాయం, డిజిటలైజేషన్ చేసి లెక్కలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

– కనకారెడ్డి, కోనాయిపల్లి (సమితి గణకుడు)

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: పదో తరగతి పరీక్షలకు జిల్లాలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ కమిటీతో అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు జరుగుతాయన్నారు. జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణ విషయంలో ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు శాఖ, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

'గ్యారంటీ'గా అమలు చేస్తాం



అక్కారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

- బడుగు వర్గాలకు మేలు చేయడమే లక్ష్యం
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ
- డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి
- అక్కారంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం

గజ్వేల్: ఆరు గ్యారంటీలను అమలు చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్ మండలం అక్కారం గ్రామంలో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగానే పేదలకు మేలు చేకూర్చే ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేయడానికి చిత్తశుద్ధితో ముందుకుసాగుతున్నారని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు. ఇకపోతే గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని అన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. ఇందుకోసం గ్రామాల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేష్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల వద్దకు సుపరిపాలన

- అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం
- కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి
- బాధ్యతలు స్వీకరించిన నూతన కలెక్టర్



నూతన కలెక్టర్ దంపతులను సన్మానించిన అధికారులు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ పథకాలను అమలు చేస్తూ సుపరిపాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లడమే లక్ష్యమని నూతన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. నూతన కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి శనివారం ఉదయం 11:40 గంటలకు బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సమేతంగా కలెక్టరేట్‌కు చేరుకోగా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరీమా అగర్వాల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అబ్దుల్ రెహమాన్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మిక్కిలినేని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా ప్రత్యేక చొరవ చూపుతానన్నారు. ప్రజావాణి దరఖాస్తులను పూర్తిగా పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల చదువులపై దృష్టి సారించి కార్పొరేట్ స్థాయికి మించి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో భూకబ్జాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన మిక్కిలినేని మను చౌదరిని శనివారం అదనపు కలెక్టర్లు, అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు పుష్ప గుచ్ఛం అందించి పరిచయం చేసుకున్నారు. అంతకు ముందు ప్రశాంత్ జీవన్ పాటిల్ పుష్ప గుచ్ఛం అందించి స్వాగతించారు. కలిసిన వారిలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సహకారం మరువలేనిది

- ఇక్కడ పనిచేయడం ప్రత్యేక అనుభూతిని ఇచ్చింది
- అభినందన సభలో కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్



ప్రశాంత్ జీవన్‌పాటిల్ దంపతులకు జ్ఞాపికను అందిస్తున్న అదనపు కలెక్టర్లు, అధికారులు

సిద్దిపేటరూరల్: కలెక్టర్‌గా ఇక్కడ పని చేయడం తనకు ప్రత్యేక అనుభూతిని ఇచ్చిందని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు అభినందన సభ, నూతన కలెక్టర్‌కు స్వాగతం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌జీవన్‌పాటిల్ మాట్లాడుతూ అనుభవం గల అన్ని శాఖల అధికారులతో సమన్వయంతో అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తాను ఇప్పటివరకు ఐదు జిల్లాల్లో పని చేశానని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఇక్కడ పని చాలా వేగంగా జరుగుతుందన్నారు. ఇతరులు చెప్పేది పూర్తిగా వింటే ఏ పని అయినా సులభంగా చేయవచ్చన్నారు. పనులపై అవగాహన, ముందస్తు ప్రణాళిక ఉంటే ఎస్‌ఎంఎస్‌ల ద్వారా కూడా పనులను నిర్వహించవచ్చన్నారు.

సార్ అంటూ మర్యాదతో..

జిల్లాను అందరి సమన్వయంతో అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకువెళ్దామని నూతన కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. ప్రశాంతమైన పరిపాలనకు మారుపేరు ప్రశాంత్ పాటిల్ సార్ అని అన్నారు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా పనిచేయడం ఆయన నైజం అని తెలిపారు. తాను తెలంగాణ కేడర్‌కు కేటాయించిన తర్వాత పోస్టింగ్ వరంగల్ స్పెషల్ ఆఫీసర్‌గా పని చేసినట్లు తెలిపారు. ఆ సమయంలో ప్రశాంత్‌సార్ వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ గా ఉన్నారని గుర్తు చేశారు. ఎంతటి ఒత్తిడిలోనైనా ప్రశాంతంగా పనిచేయడం చూసి ఆశ్చర్యపోయానని అన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌ఓ నాగరాజమ్మ , జిల్లా అధికారులు మాట్లాడుతూ పేరుకు తగ్గట్టుగా ప్రశాంత్ జీవన్ పాటిల్ జిల్లాలో పరిపాలన ప్రశాంతంగా నిర్వహించారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రశాంత్ జీవన్ పాటిల్ ను, నూతన కలెక్టర్ మను చౌదరి దంపతులను సన్మానించారు.

క్లుప్తంగా

సైబర్ మోసం

రూ.24.80 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

సిద్దిపేటకమాన్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ పేరిట వచ్చిన లింకులో భారీగా పెట్టుబడి పెట్టి వ్యక్తి మోసపోయాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఇన్‌స్టాగామ్‌లో స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు సంబంధించిన లింకును పంపించాడు. అందులో తక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని నమ్మించాడు. ఆ లింకును ఓపెన్ చేసి బాధితుడు.. మొదటగా పెట్టుబడి పెట్టగా లాభాలొచ్చాయి. అదే విధంగా పలు విడతలుగా మొత్తం రూ.24,80,500 ఆన్‌లైన్‌లో పంపాడు. తర్వాత ఆ లింకు ఓపెన్ చేస్తే బ్లాక్ చేసినట్లు మెసేజ్ కనిపించింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు 1930లో ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి మృతి

సిద్దిపేట కమాన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటుచేసుకుంది. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ గ్రామానికి చెందిన కాంతపు హనుమంతు సిద్దిపేట పట్టణంలో కొంతకాలంగా నివాసం ఉంటూ కూలిపనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. హనుమంతుకు ఏడేళ్ల క్రితం నాచుపల్లి గ్రామానికి చెందిన కవితతో వివాహం జరగగా మూడేళ్ల అనంతరం ఆమెతో విడిపోయి పట్టణానికి చెందిన మరో మహిళతో ఉంటున్నాడు. కాగా హనుమంతు ఇంటికి రెండు రోజులుగా తాళం వేసి ఉండడంతో చుట్టుపక్కల వారు హనుమంతుకు ఫోన్ చేసినా స్పందించలేదు. విషయం తెలుసుకున్నకుటుంబసభ్యులు వచ్చి హనుమంతు కోసం ఎంత వెతుకుతుండగా హనుమంతు పట్టణంలోని ఎర్రచెరువులో పడి మృతి చెందినట్లు గుర్తించారు. చేపలవేటకు వెళ్లి మృతి చెందినట్లు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, B.Tech., Diploma, D-ఫార్మసీ, B-ఫార్మసీ, D.Ed (TTC), B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 3 నెల్లో కోర్స్ పూర్తిచేసే అవకాశం. ఫోన్: 8888977112,339. [HA-13295]

■ అడ్మిషన్స్: 10th, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, PG /B.Tech/M.Tech/MBA/MCA/MS/MBBS/D/B/M ఫార్మసీ, FAST TRACK (ఫెయిల్ స్టూడెంట్) WT'S app: PH: 7993080835. [HA-1267]

REAL ESTATE

■ Open Plots, Constructing House / Firm, Agri.Lands. సిమెంట్ స్లాబ్స్‌తో కాంపౌండ్ వాల్ కట్టబడును, అతి తక్కువ Cost తో. సంప్ర: 7816074811, 9912660879. [H-788296]

FLAT FOR SALE

■ ప్రజ్ఞాపూర్-కరీంనగర్ హైవే ప్రక్కన తక్కువ బడ్జెట్‌లో Luxury అపార్ట్‌మెంట్‌లో Flats కలవు. Sft 1010, బ్యాంకులోన్ కలదు. రెడీ టూ అక్యూపై. ఫోన్: 9491777586. [H-804752]

LAND FOR SALE

■ Independent Houses For Sale @ Malkapur, Sangareddy. 141 S/Y 1100 sft Top Quality Built-Up, E/F with N-E Entrance. Ready to Occupy, Prime Location, Bank Loan available. PH: 9063510400 9391003272 [HA-96610]

SERVICES

BUSINESS OFFER

■ మీ బంగారం తాకట్టులో ఉందా. వడ్డీ చెల్లించలేకపోతున్నారా. ఎటువంటి ఫైనాన్స్‌లో ఉన్నా బంగారాన్ని విడిపించి ఈరోజు మార్కెట్ ధరకే కొనబడును. ఫోన్: 9389214214. [HA-787728]

■ ద్వారక ఎంటర్‌ప్రైజ్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం. ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1438]

WANTED

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-799701]

■ గుంటూరు వద్ద అడ్వకేట్ ఆఫీసులో ఉండి పని చేయుటకు అనుభవమున్న డ్రైవరు మరియు జూనియర్ లాయరు కావలెను. రూము సౌకర్యం+జీతం 20-25వేలు ✆ 8106719134 / 9346928964 [G-781749]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 9059663584. [M-1233857]

■ హరేకృష్ణ హోమ్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k ఫోన్: 9640258899 / 9640468899. [H-793694]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అరుణ వర్ణ శోభితం

సంగారెడ్డి చెరువు కట్ట పై సూర్యాస్తమయ సమయంలో సుందర దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశం సైతం అరుణ వర్ణంలోకి మారిపోయింది. చెరువు ఆవరణంతా కాన్వాస్ పై గీసిన ప్రకృతి చిత్రంలా కానవస్తుంది. సూర్యుడిని మొక్కల మీదుగా చూస్తే వాటికి కాచిన పండులా అందంగా కనిపించాడు. సాయంత్రం వాకింగ్‌కు వచ్చిన వారంతా ఈ ఆహ్లాద దృశ్యాన్ని చూసి మైమరచిపోయారు. యువతులు సెల్ఫీలు దిగడం కనిపించింది.

– బి. శివ ప్రసాద్, సాక్షిస్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి.









ఆశలు సజీవం

- తెరపైకి నల్లవాగు వృథా నీటి మళ్లింపు
- రూ.280 కోట్లతో ప్రతిపాదనలు
- నిజాంసాగర్ ప్రాజెక్టు వరకు కాల్వ నిర్మాణం
- ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రస్తావన
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్న



నల్లవాగు ప్రాజెక్టు అలుగుపై నుంచి వృథాగా పారుతున్న నీరు(ఫైల్)

కల్హేర్(నారాయణఖేడ్): ఉమ్మడి జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు వృథా నీటి మళ్లింపు అంశం తెరపైకి వచ్చింది. ఆ జలాలను సద్వినియోగం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులు ఇటీవల రూ.280 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. వర్షాకాలంలో ప్రాజెక్టు నిండిన ప్రతి యేటా 2 టీఎంసీల వరకు నీరు వృథాగా వెళ్లి మంజీరా నది నుంచి గోదావరిలో కలుస్తుంది. ప్రాజెక్టు అలుగుపై నుంచి వృథాగా పారుతున్న నీటిని అడ్డుకట్ట వేసి చెరువులు, కుంటలు, మిగతా నీటిని కామారెడ్డి జిల్లా పరిధిలోని నిజాంసాగర్ ప్రాజెక్టులో తరలించేందుకు అక్కడి వరకు కొత్తగా కాల్వ నిర్మాణం చేయాలనేది ప్రధాన లక్ష్యం.

మహానేత వైఎస్సార్ హయాంలో ఆలోచన

మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాం 2008-09లో ఈ వృథా నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మళ్లింపు పనులు చేపట్టాలనే ఆలోచనకు బీజం పడింది. అప్పట్లో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించింది. నల్లవాగు ప్రాజెక్టు నుంచి సిర్గాపూర్ మండలం ఖాజాపూర్, కల్హేర్ మండలం ఖానాపూర్(కె), కృష్ణాపూర్, అలీఖాన్‌పల్లి, రాపర్తి, మీర్జాన్‌పేట, బాచేపల్లి గ్రామల మీదుగా కాల్వ నిర్మాణం చేపట్టి నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారు. అప్పట్లో అధికారులు సర్వే చేశారు. రూ. 80 కోట్లతో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. నిధులు మంజూరు దశలో వైఎస్సార్ మరణంతో బ్రేక్ పడింది.

తాత్కాలిక అంచనాలు

నల్లవాగు వృథా నీటిని మళ్లింపు పనులు చేపట్టాలని ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిను కలిసి వినతి పత్రం అందజేశారు. వ్యయంపై అంచనాలు రూపొందించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అధికారులు సర్వే చేసి తాత్కాలికంగా రూ. 280 కోట్లతో ప్రదిపాదనలు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశల్లో ఎమ్మెల్యే సంజీవరెడ్డి తిరిగి ప్రస్తవించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారు అధికారంలో ఉండటంతో వృథా నీటి మళ్లింపు పనులు జరిగితే మరో 2 వేల ఎకరాల పైగా ఆయకట్టు భూములకు మోక్షం లభించే అవకాశం ఉంది.

సీఎంఓ ఆఫీస్‌లో ఫైల్



నల్లవాగు వృథా నీటి మళ్లింపు పనులకు సంబంధించిన ప్రతిపాదనల ఫైల్ సీఎంఓ కార్యాలయానికి చేరింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. వరద కాల్వ పనులు చేయకుండా గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కన పెట్టేసింది. అప్పటి మంత్రి హరీశ్‌రావు నిధులు మంజూరు చేయకుండా విస్మరించారు. మెడిగడ్డ ప్రాజెక్టు కృంగిపోవడంతో సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పనులకు ఆటంకం ఏర్పాడింది. సింగూరు ప్రాజెక్టు నుంచి నల్లవాగు నింపేందుకు, నియోజకవర్గంలో సాగు నీటి సమస్య తీర్చేందుకు సంగమేశ్వర, బసవేశ్వర పనుల కోసం కృషి చేస్తున్నాం. రైతులకు సాగు నీరు అందించేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నాం.

–పి.సంజీవరెడ్డి, ఎమ్మెల్యే నారాయణఖేడ్



నల్లవాగు ప్రాజెక్టు

పల్స్ పోలియోకు సమాయత్తం

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా మార్చి 3వ, 4వ, 5వ తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్‌తో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 3న బూత్ యాక్టివిటీ, 4, 5వ తేదీల్లో హౌస్ టు హౌస్ యాక్టివిటీ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,96,352 గృహాలను సందర్శించి 0-5 సంవత్సరాల వయస్సు ఉన్న 82,075 మంది పిల్లలకు చుక్కలు వేయాలన్నారు. 717 బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 306 హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించామని, 37 మొబైల్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. బస్టాండ్లు, మార్కెట్లలో 20 బూత్‌లను ఏర్పాటు చేసి ప్రయాణంలో ఉన్న పిల్లలను ఇమ్యూనైజ్ చేయడానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణకు 122 సూపర్‌వైజర్, 2,977 వ్యాక్సినేటర్లను నియమించినట్లు తెలిపారు. ఈనెల 28 నుంచి మార్చి 5వ తేదీ వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పవర్ కటింగ్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యవేక్షణ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ కాశీనాథ్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ విజయరాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిని, డిప్యూటీ డీఎంహెచ్ఓలు మల్లేశ్వరి, ప్రభాకర్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి , డీడబ్ల్యూఓ సావిత్రి, మున్సిపాలిటీల కమిషనర్లు, విద్యుత్, రవాణా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాష్టాంగ నమస్కార సాధువుకు సన్మానం

11 నెలల్లో 5 వేల కిలోమీటర్ల యాత్ర పూర్తి



సాధువును సన్మానించిన గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): గంగోత్రి నుంచి రామేశ్వరం వరకు సాష్టాంగ నమస్కారం చేస్తూ సాధువు రాజగిరి మహదేవ్ చేపట్టిన యాత్ర శనివారం కుకునూరుపల్లికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కాచం నవీన్‌కుమార్, నాయకులు ఉప్పల పాండు, రాజులతో పాటు గ్రామస్తులు.. యాత్రకు ఘనస్వాగతం పలికారు. మహదేవ్‌కు పండ్లను ఇచ్చి రూ. 3వేలను అందజేశారు. ఈ యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని కరోలి జిల్లాకు చెందిన ఆయన ఇప్పటి వరకు 11 నెలలుగా సాష్టాంగ నమస్కారాలు చేస్తూ 5 వేల కిలోమీటర్ల దూరం పూర్తి చేశారు. మరో 1,150 కిలోమీటర్ల దూరం వరకు సుమారు 6 నెలల కాలం పడుతుందని సాధువు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఎండలు ముదిరిన తరుణంలో కాలినడకన వెళ్లడమే కష్టమన్నారు. అలాంటిది ఇన్ని కిలోమీటర్ల మేర సాష్టాంగ నమస్కారాలు చేస్తూ యాత్రను చేపట్టడం సామాన్య మానవులకు సాధ్యం కాదన్నారు.

చదువును ఇష్టంగా స్వీకరించాలి

గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల



విద్య ప్రాముఖ్యాన్ని వివరిస్తున్న నిర్మల

కొండపాక(గజ్వేల్): చదువుకోవడం కష్టమనుకోకుండా ఇష్టంగా స్వీకరించాలని గురుకుల పాఠశాలల రీజినల్ కోఆర్డినేటర్ నిర్మల పేర్కొన్నారు. మండలంలోని దుద్దెడలో గల గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. 10వ తరగతి విద్యార్థులతో మమేకమై.. విద్యాపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను వదిలిపెట్టి విద్య కోసం ఇక్కడికి విద్యార్థులు వస్తున్నారని, మదిలోకి వారు రాకుండా మంచి బోధనను ఉపాధ్యాయులు అందించాలన్నారు. విద్యార్థులు పరిజ్ఞానం పెరిగేలా ప్రాక్టీస్‌లా స్వీకరిస్తూ చదువుకోవాలన్నారు. వారు, ఉపాధ్యాయులు స్నేహపూర్వకంగా వ్యవహరిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అయితే మానకొండూర్ నియోజకవర్గంలోని అన్నారం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త కిష్టారెడ్డిని.. పాఠశాలలో మినీ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ వెంకటరమణాచారి కోరగా రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేస్తే దాన్ని ఆమె ప్రారంభించారు. ముందుగా ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో చిట్యాల నర్సింహులు, ఉపాధ్యాయులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సపర్యలు చేసేందుకు వచ్చి శవమై..

- అనుమానాస్పదస్థితిలో భార్య మృతి
- భర్తే హత్య చేశాడని తండ్రి ఫిర్యాదు



నాగమణి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): గాయపడ్డ భర్తకు సపర్యలు చేసేందుకు వచ్చిన భార్య అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. ఈ ఘటన సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తున్కిఖాల్సాలో శనివారం జరిగింది. రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండగల్ల కృష్ణ, నాగమణి(36) భార్యాభర్తలు. వారికి సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్ సంతానం. పెళ్లి తరువాత కొంతకాలానికే భర్త తాగుడుకు బానిసై ఆమెను చిత్రహింసలకు గురి చేస్తున్నాడు. దీంతో ఏడాది క్రితం తండ్రి సిరసాధుల అర్జున్ .. కుమార్తె నాగమణిని, మనవళ్లను వెంట బెట్టుకొని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లాల్‌గాడి మలక్‌పేటలోని తన ఇంటికి తీసుకెళ్లాడు. ఇటీవల భర్త బైక్‌పై నుంచి పడి గాయపడ్డాడని తెలుసుకొని చూసుకునేందుకు ఫిబ్రవరి 5న తున్కిఖాల్సాకి ఆమె వచ్చింది. శుక్రవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగగా తాగిన మత్తులో కొట్టాడని పెద్దకొడుకుకు ఫోన్ చేసి చెప్పింది. శనివారం తెల్లవారుజామున శవమై ఇంటి ఎదుట పడి ఉంది. మెడ, కుడిచెవికి గాయాలున్నాయని తెలిసింది. స్థానికులు మృతిచెందిన విషయాన్ని కుటుంబీకులకు సమాచారం అందించగా వారొచ్చి మృతదేహాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. తమ కూతురును అల్లుడే హత్య చేశాడని మృతురాలి తండ్రి సిరసాధుల అర్జున్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ పేర్కొన్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

యువతి ప్రేమించడం లేదని ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: యువతి ప్రేమించడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌కు చెందిన కార్తిక్ బర్మాన్(22) బతుకుదెరువు కోసం మూడున్నర నెలల క్రితం పటాన్‌చెరుకొచ్చి గౌతంనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇక్కడే ఉంటున్న వీరి గ్రామస్తుడు బోనమాలి బర్మాన్ వద్ద పనికి కుదిరాడు. రోజూ మాదిరిగానే 23న ఉదయం షాపునకు వెళ్లి సాయంత్రం 6 గంటలకు రూమ్‌కు వచ్చాడు. అదే రోజు రాత్రి 11 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బోనమాలి.. అతడి కోసం స్థానికంగా చుట్టుపక్కల వెతుకుతుండగా శనివారం తెల్లవారుజాము షాపునకు సమీపంలో ఒక చెట్టుకు బెల్టుతో ఉరి వేసుకొని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. యువతి తనను ప్రేమించడం లేదని మనస్థాపంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడని బోనమాలి.. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాత అంత్యక్రియలకు వెళ్తుండగా..

- బైక్‌ను ఢీకొన్న లారీ
- మనవడి మృతి, మరో తాత, నాయనమ్మకు తీవ్రగాయాలు



గొల్లపల్లి సాత్విక్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): మరో తాత అంత్యక్రియలకు తాత, నాయనమ్మలతో కలిసి మనవడు బైక్‌పై బయలుదేరగా.. మార్గమధ్యలో లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ ప్రమాదంలో మనుమడు మృతిచెందాడు. వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కుకునూరుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొడకండ్లలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన సాత్విక్(15), నాయనమ్మ, తాత గొల్లపల్లి రాములు, లక్ష్మితో కలిసి.. మరో తాత (తల్లి తండ్రి) అంత్యక్రియల నిమిత్తం బైక్‌పై బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం నాగిరెడ్డిపల్లి వద్దకు రాగానే సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే క్షతగాత్రులను అంబులెన్స్‌లో గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే సాత్విక్ మృతిచెందాడు. మెరుగైన వైద్యం కోసం రాములను వంటిమామిడిలో గల ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి.. గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. అయితే జగదేవ్‌పూర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాల నుంచి వచ్చిన సాత్విక్ గంటలోపే విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు, బంధువులు, తోటి విద్యార్థులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి రవీందర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ జహురుల్‌హక్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



నరేష్ (ఫైల్)

టేక్మాల్(మెదక్): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన టేక్మాల్ మండలం సంగ్యా తండాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కెతావత్ నరేష్(23) వ్యవసాయంతో పాటు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు ఒకరోజు.. తండాలో విద్యుత్ దీపాలను అమర్చే పనిని ఒప్పుకున్నాడు. ఆ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సరఫరా ఆపి స్తంభం ఎక్కి పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు పైన ఉన్న 11 కేవీ వైర్లకు చేయి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సబ్ స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకోకుండా స్తంభాలు ఎక్కించి అతడి మృతికి అధికారులు కారణమయ్యారని కుటుంబసభ్యులు ఆరోపించారు. తండ్రి కెతావత్ పద్యా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తుక్కయ్య తెలిపారు.

మహ్మదాపూర్‌లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

- 14.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల స్వాధీనం
- అదుపులో నిందితులు



నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న టాస్క్ ఫోర్స్, పోలీసులు

హుస్నాబాద్‌రూరల్: మహ్మదాపూర్‌లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, హుస్నాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు మహ్మదాపూర్‌లోని ముక్కెర మల్లయ్య ఇంటిపై శనివారం దాడులు చేసి 50 కిలోల బ్యాగులు 29 స్వాధీనం చేసుకున్నారు. నకిలీ విత్తనాలు సరఫరా చేస్తున్న హన్మకొండ జిల్లా వేలేరు వాసి సురేష్, గాగిరెడ్డిపల్లి వాసి సతీష్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ విత్తనాల విలువ రూ.35 లక్షల ఉంటుందని, వీటిని వచ్చే వానాకాలం సీజన్‌లో కోహెడ, అక్కన్నపేట, హుస్నాబాద్ ప్రాంత రైతులకు విక్రయించేందుకు ముఠా సభ్యులు పథకం వేసుకున్నారని ఎస్ఐ మహేశ్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఎవరైన నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన ఎరువులు అమ్మినట్లు అయితే టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 87126-67447, 87126-67446 నంబర్లలో సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అయితే ఎరువు దుకాణంలో ప్రభుత్వం ఆమోదించిన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేయాలని సూచించారు. వ్యాపారులు లాభాల కోసం అడ్డదారుల్లో వెళ్లి రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంకల్ప సభ వద్ద గంజాయి కలకలం..?

నర్సాపూర్: బీజేపీ సంకల్ప సభ సమీపంలో గంజాయి అమ్మారని కలకలం చెలరేగింది. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో సభ ఏర్పాటు చేశారు. సభలో కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా పాల్గొన్నారు. సభా వేదిక వెనుక భాగాన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం దౌల్తాబాద్‌కు చెందిన ఓ యువకుడు గంజాయి విక్రయిస్తున్నాడని కలకలం రేగింది. పలువురు స్థానిక యువకులు అతడిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. దౌల్తాబాద్‌కు చెందిన వాసిగా గుర్తించారు.

ఈ విషయమై స్థానిక ఎస్ఐ పుష్పరాజ్‌ను వివరణ కోరగా సభ ఏరియాలో గంజాయి అమ్మినట్లు తమ దృష్టికి రాలేదని, సభ వేదిక సమీపంలో ఓ యువకుడు న్యూసెన్స్ చేయడంతో అతడిని అక్కడి నుంచి పక్కకు తీసుకు వెళ్లారని చెప్పారు.